కష్టార్జితం

సత్యవతి భూదేవిలాంటిది. ఐతేం ? ఎంత ఓరిమిగలవాళ్ళైనా, సాధింపు హద్దుమీరినప్పుడు "ఛ్ఛ"మనక మానరు. పిల్లిలాంటి సాధుజంతువుకూడా అదేపనిగా తరుముకొడితే, పరుగెత్తుతోన్నదల్లా తటాలున వెనక్కి తిరిగి మీదపడి బరుకుతుంది. ఆనాడు సత్యవతికూడా అలాగే చేసింది.

అంటే బరికిందని కాదు. అంత ధైర్యమేది ఆ పిల్లకి ? అత్తగారిమాటకి సమాధానం చెప్పింది. అంతే. చెప్పి, తర్వాత పశ్చాత్తాపపడింది.

'అక్కడ కూచున్నావు. ఇక్కడ నిలబడ్డావు. ఆ పని చేశావు. ఈ పని చేశావు కాదు.' ఇలాంటి మామూలు సాధింపు కాదు, కల్పకమ్మ గారిది. కోడలు నలుపని కాదు; పనిపాటలు చేతగానిదని గాదు; చదువు సంధ్యలు లేనిదనీ గాదు ఆవిడ అసంతృప్తి సత్యవతిది సువర్ణచ్ఛాయ, పుట్టింట ఆటపాటలే గాని పనిపాటలు నేర్చుకోనిమాట నిజమే. ఐతేం, అత్తింట అడుగుపెట్టిననాటినుంచే పనిలో శ్రద్ధచూపింది. ఆమాటకొస్తే, అత్తింట కూడా ఆమెకు పనేలేదని చెప్పాలి. ఆమెకేగాదు కల్పకమ్మ గారికేలేదు. ఏమంటే సంపన్నులు వాళ్ళు. రాఘవయ్యగారు ప్లీడరిలో రెండు చేతులా ఆర్జిస్తున్నారు పిత్రార్జితమే యాభై యకరాల పల్లముంది వారికి. తోటలున్నాయింకా. కల్పకమ్మ దర్జా కనపర్చాలన్న తరహాలో మనిషి గనక సీతన్నను వంటకు పెట్టింది. సీతన్నగాక తోటవాడున్నాడు. దాసీమనిషి మాట చెప్పనక్కర్లేదు. అందుచేత ఆవిడికిగాని సత్యవతికిగాని ఆ యింట్లో చెప్పతగ్గ పనేలేదు. ఐతే ఇంక కల్పకమ్మగారు ఎందుకూ కోడల్ని సలపటం ?

కల్పకమ్మ కాపరాని కొచ్చినప్పట్నుంచీకూడా, 'నాకు కొడుకులే పుట్టాలి' అని బ్రహ్మని కోరుకుంది. ఆమెకు జడిసో, మరెందుచేతనో గాని బ్రహ్మదేవుడు ఆమెకు కుమారుణ్ణే ప్రసాదించాడు. ఆ పిల్లవాడికి మోహనరావని పేరెట్టుకుందావిడ. మోహనుడు ఎదిగి వస్సు చేసినకొద్దీ అందగాడై

పేరుకు తగ్గవాడనిపించుకున్నాడు. చదువులో అంతపెద్ద లెక్కల్లోకి రాకపోయినా యేటేటా ప్యాసవుతూవచ్చాడు. ఐశ్వర్యంతోబాటు చదువు కూడా ఉంటేనే మంచి కట్నంతో పెళ్లికూతురు వస్తుందని కల్పకమ్మగారు మొదటినుంచీ ప్లానువేసి, ప్రయివేటు చెప్పించి, అతడు ఫెయిలవకుండా చూసింది.

మోహనుడు స్కూలుఫైనలు చదువుతూనప్పట్నుంచి పెళ్ళి సంబంధాలొచ్చేవి. వాళ్ళు ఇస్తామన్న కట్నంకానుకల జాబితా వినేసి, తనకి చాలా తక్కువని తోచి, 'మావాడింకా పెళ్లిచేసుకోనంటున్నాడ'ని చెప్పి పంపేది. ఆవిడ అభిప్రాయం ఏమిటో ఈ విధంగా ఏ కన్యాప్రదాతకీ అంతుచిక్కలేదు. మోహనుడు ఇంటర్లోకి వచ్చాడు. బి. ఏ. లోకి వచ్చాడు సంబంధాలు వస్తూనే ఉన్నాయి. ఒకళ్లకన్న ఒకళ్లు క్రమంగా హెచ్చుకట్నం ఇస్తామనే అన్నారు. ఐనా ఆవిడ అనుకున్న స్థాయికి వాళ్ళు రాలేదు. అంచేత, 'మోహనుడింకా పెళ్లికిష్టపడడు.'

ఆ ఊళ్ళోనే అంటే నెల్లూరులో భానోజీరావుగారు జడ్జీ. ఆ జడ్జీగారికొకనాడు పెద్దాపురంనుంచి ఒక జాబు వచ్చింది. 'మీ ఊళ్ళో పెళ్ళికొడుకు లెవరైనా ఉన్నారా!' అని వాకబుచేస్తూ, బాల్యస్నేహితుడు పురుషోత్తం రాశాడు. జడ్జి సమాధానంలో రాఘవయ్యగారి కొడుకుమాట రాస్తూ, 'కట్నం విషయంలో నీ కందుబాటులో ఉండదేమో మరి' అని చేర్చేరు. ఈ జవాబు అందటంతోనే పురుషోత్తం స్వయంగా బయల్దేరివచ్చి చాటుగా పెళ్ళికొడుకుని చూచి తృప్తిపడి, జడ్జీగారితో, 'భానోజీరావ్, ఈ సంబంధం నువ్వెలాగైనా మాకు నిశ్చయం చేసిపెట్టాలి' అని పట్టుబట్టాడు. 'మూడువేలదాకా ఇస్తామంటూ వచ్చినవాళ్ళనికూడా పంపేశారుట!' అన్నాడాయన. 'ఎంతైనా ఇస్తాను. పిల్ల సుఖపడుతుంది. నీకు పుణ్యముంటుంది. కుదిర్చిపెట్టు' అని పురుషోత్తం బ్రతిమాలాడు. భానోజీరావుగారికి ఆశ్చర్యంవేసింది పురుషోత్తం ఆయనెరుగున్నంతమట్టుకి అట్టే ఆస్తిపరుడు కాడు. 'ఎంతైనా ఇస్తానంటున్నారు. దరిమిలాను బాగా సంపాదించాడన్నమాట' అనుకున్నాడు. రాఘవయ్యగారితో ఆయనా కల్పకమ్మగారితో ఆయన భార్యా పురుషోత్తం కూతురుమాట చెప్పారు. పెళ్లికూతురు ఫోటో చూపించారు. వాళ్ళకి సత్యవతి నచ్చిందనటంతోనే, "మీ అభిప్రాయం యేమిటో చెప్పండి" అన్నారు. 'అభిప్రాయానికేముంది

లెండీ; మేం అడుగుతామా ఏమిటి? వారు ఇష్టపడ్డంత. వారి సరదాకొద్దీ ఇవ్వటమే. ఇంతకీ మాకు కట్నంగావాలన్న పట్టుదలలేదు. కాని పుచ్చుకోకుండా చేసుకుంటే పిల్లవాడికేదో లోపముండి, అయిందే చాలని చేసుకున్నామేమో అని లోకులు అనుకుంటారు. అందుకోసంగాని...' అని ఆరంభించారు. ఆ తరవాత 'వారింత ఇస్తామన్నారు' 'వీరింత ఇస్తామన్నారు' అని చేర్చేరు. 'ఔను. వింటూనేఉన్నాను, మీకెంతకావాలో చెప్పెయ్యండి. సెటిల్ చేస్తాను' అన్నారు జడ్జీగారు. జడ్జీదంపతులు స్వయంగా వచ్చి మొహమాటం పెట్టటంవల్ల. 'మీరే చెప్పండి. ఏమిస్తారో?' అని మళ్ళీ అని తప్పుకోటానికి మగపెళ్ళివారికి వీల్లేకపోయింది. రాఘవయ్యగారు భార్యకేసి చూశారు. కల్పకమ్మగారు చెప్పేసింది. ఐదువేలు కట్నం తతిమ్మా యేవేవో లాంఛనాలూను. పురుషోత్తం, 'ఇస్తాను' అన్నాడు. 'కొంచెం తగ్గండి' అని ప్రాధేయపడతాడనుకుంటూంటే పురుషోత్తం ఇలా ఒప్పేసుకోడం భాగోజీ దంపతులకి ఆశ్చర్యంవేసింది. రాఘవయ్య దంపతులకి 'తక్కువగా అడిగేశామన్నమాట' తొందరపడ్డాం! అని విచారం వేసింది.

దరిమిలాన సత్యవతీ - మోహనులకి పెళ్ళి అయింది. పురుషోత్తం అనుకున్న ప్రకారం, కట్నమూ కానుకలూ ఇచ్చేశాడు. అసుకోనివేవో ఇంకా జరగలేదని పేచీలొచ్చాయి పెళ్ళిలో. ఆడపెళ్ళివారితరఫున పెళ్ళికివచ్చిన ముత్తయిదువ ఎవరో, తంగినకొద్దీ వంచుతోంది ఈ వియ్యపురాలు!" అంది, ఆమాట కల్పకమ్మ చెవినిపడి, పెద్ద రభస జరిగింది. "ఒక్కగాని ఒక్క కొడుకు. నా ముచ్చటలన్నీ తీర్చొద్దా?" అంటూ ఆమె నాగవెల్లినాడు భోజనాలు లేకుండానే రైలెక్కించింది తనవాళ్ళని. "సత్యవతికూడా ఒక్కగాని ఒక్క కూతురే మాకు. ఈవిడ మాకు తీర్చిన ముచ్చటలేమిటి మహా!" అంది పిల్లతల్లి "ఊరుకో" అన్నాడు పురుషోత్తం.

క్రమంగా సర్దుకుంటూ వచ్చాడు పురుషోత్తం. సర్దుకునేవేగాని, కల్పకమ్మగారికి తమ వియ్యంకుడి రహస్యం తెలిసి అతడు చేసిన త్యాగానికి మెచ్చుకోటానికి బదులు ఆమెకు ఆగ్రహం ఎక్కువైంది. పురుషోత్తానికి అంతాకలిపి పుట్టెడు భూమికన్న ఎక్కువలేదు. అందులో ఆరెకరాల ఖండం తొమ్మిదివేలకు అమ్మేసి, ఐదువేలు కట్నంక్రిందా ఖర్చుపెట్టాడు. ఆయన అనుకున్న దేమిటంటే, సత్యవతి ఒక్కత్తే కూతురు. దానికి మంచి

సంబంధంచూసి పెళ్ళిచేస్తే ఇంక తనూ తన భార్యేగా? తన సంపాదనతో కాలం గడిచిపోతుంది. ఉన్న భూమి అమ్మేస్తేమాత్రమేం, గొప్ప సంబంధం వచ్చినప్పుడు? ఈ ఉద్దేశంతో అతడు సాహసించాడు. కల్పకమ్మగారు, "వీళ్ళు సామాన్యులు, మేం అడిగినదంతా ఇస్తామని ఒప్పుకోటంలో ఎవరో గొప్పవాళ్ళనుకుని మోసపోయాం. మాకు ద్రోహంచేశారు" అనుకోడం మొదలెట్టింది.

దీనికితోడు మరో మూణ్ణెల్లకి మోహనుడి క్లాసుమేటు కాశీపతికి పెళ్ళి అయింది. కాశీపతి మోహనరావుకన్న ఓచాయ తక్కువ రాఘవయ్యగారి ఆస్తికన్నా వాళ్ళది ఏమాత్రమో తక్కువే. ఐనా కాశీపతికి ఎక్కువ కట్నం వచ్చింది. ఆడపెళ్ళివా రెవరో జమీందార్లట. అమాంబాపతులు పది వేలదాకా మాటజెప్పారు. అక్కడితో ఆగిందా? వాళ్లది నుయ్యి, కాశీపతిది చేదాను! కల్పకమ్మకి మహా దుగ్ధగా ఉంది. 'ఏంకొంప మునిగిపోయిందని నేనిలా తొందరపడ్డం? ఆ జడ్డీగారిమూలాన ఇలా బోల్తాపడిపోయాను. మనవాడికి పెళ్ళి అయిపోయిందని తెలిసి కాశీపతిని చూసుకున్నారుగాని, లేకపోతే ఆ జమీందార్లు మనగుమ్మం ఎక్కవలసిన వాళ్ళేగా! కళ్ళు మూసుకుని గోతులో పడిపోయాను!"

పురుషోత్తం మళ్ళొక్క యకరం అమ్మేసి కల్పకమ్మ దర్జాకి లోపం రాకుండా ఉండేఫక్కీలోనే సారెపెట్టి సత్యవతిని అత్తింటికి పంపాడు. కాని కాశీపతి పెళ్ళాం దానికి రెట్టింపు సారె తెచ్చింది. దాన్ని తల్చుకుంటూ కల్పకమ్మ 'ఎండుగులవారు ఎండుగుల ఎండబెట్టుకుంటే ఎలుక తోక ఎండ బెట్టుకుందిట! చూడండి మా వియ్యాలారు పెట్టారు సారె!' అని గుమ్మంలోకి వచ్చినావిడతో అనేసింది. ఆ వచ్చినావిడ, 'వారిది నుయ్యి, మీది చేదాను! అప్పుడే ఏమయిందిలెండి' అన్నది. కల్పకమ్మ 'ఆ నుయ్యి పెళ్ళినాడే ఎండిందమ్మా' అంటూ, తనకు జరిగిన 'మోసం' 'ద్రోహం' వెళ్లబోసుకుని కంటతడిదాకా తెచ్చుకుంది.

సత్యవతికి అత్తింట మరేకష్టంలేదు. కాని మనస్సు సున్నితమైన పిల్లకి ఆమాత్రంచాలు మథనపడ్డానికి. 'మా నాన్న ఎంత తెలివితక్కువ పని చేశాడు! నాకోసం చూసిన సంబంధాలలో పుట్టెడు భూమి ఉన్నవాళ్లెందరో ఉన్నారు. ముందు ముందు ఈయన పుట్టెడు భూమికూడా తనకే

వస్తుందిగదా అన్న ఆశకొద్దీ వాళ్లంతా వేరే కట్నమడక్కుండా ఈ సంబంధం నిశ్చయం చేసుకోటానికి ప్రయత్నించారు. నాన్న వాళ్ళని కాదని ఈ జమీందారీ సంబంధానికి ఎగబాకి భంగపడ్డాడు. భూమి అంతా నాకోసం తెగనమ్మి, రెక్కాడితేనేగాని డొక్కాడదనే స్థితిలోకి తెచ్చుకున్నాడు. ఇదంతా 'మోసం' 'ద్రోహం'కింద ఐపోయింది వీళ్ళకి."

కాశీపతి ఆనాడు మోహనుడికోసం వచ్చాడు. బ్లేజరు సూటూ, బంగారపు రిస్టువాచీ వగైరాలన్నీ అతగాడికి వన్నెదెచ్చాయి. అవన్నీ 'అత్తగారిచ్చినవే' అని కల్పకమ్మ ఊహించుకుని మెల్లిగా ప్రారంభించింది. ఇరుగావిడో పొరుగావిడో ఆ సాధింపు వినటానికీ, మధ్యమధ్య ఓ పుల్ల వెయ్యటానికీ ఎదురుగా వున్నదేమోఅంటే ఎవరూలేరు. సత్యవతి ఒక్కత్తే ఆ గొణుగు వింటూంది. వినాలనేగా ఆవిడ అంటూన్నదీని! కొంతసేపటికి కాశీపతితో మోహనుడు బయటకు వెళ్లిపోయాడు. ఇంక అత్తగారి గొణుగు ఆగుతుందనుకుంది సత్యవతి. కాని స్థాయి ఎక్కువైంది. 'నిర్భాగ్యుల్ని ఎవరు బాగుచెయ్యగలరు? నిక్షేపంలాంటి సంబంధం బారెడు దూరంలో ఉందని తెలుసుకోలేక తొందరపడి గోతిలో పడ్డాను' అంది కల్పకమ్మ.

సత్యవతికి తానేం చేస్తూన్నదీ వొళ్ళు తెలియలేదు. చరచరా అత్తగారి ఎదటకొచ్చి, 'ఎన్నాళ్లీ అసంతృప్తి? అలాంటి నిక్షేపపు సంబంధమేదైనా ఇంకొకటి ఉందేమో చూడండి!' అంది. భూదేవే కంపించింది! కల్పకమ్మ కూలపడింది. కాని ఇట్టే సద్దుకుని, కళ్ళనిప్పులు రాలుస్తూ, "ఏమిటీ అన్నావు? మరొక సంబంధం చూడనా? నేను తలుచుకుంటే చూడలేననేనా! ఒకటికాదు పది పెళ్ళిళ్లు చెయ్యగలను నా కొడుక్కి. ఏమనుకుంటున్నావో? 'మన అదృష్టంకొద్దీ ఈ పంచను చేరుకోగలిగేం' అని సంతోషిస్తూ ఊరుకోక నన్నే ఎదిరిస్తావా? కఫడ్దార్. ఏమనుకున్నావో!" అని ఉరిమింది. వంటచేస్తూన్న సీతన్న 'ఏమిటి చెప్మా?' అనుకుంటూ అక్కడికొచ్చాడు. సత్యవతి గదిలోకి పరుగెత్తి, పరుపుమీద పడి వెక్కి వెక్కి యేడ్చింది.

ఆరాత్రి సత్యవతి భోజనం చెయ్యలేదు. మోహనుడికా సంగతి తెలియలేదుకాని, 'అలా ఉన్నావేం?' అని అడిగాడు. ఆపిల్ల, వెక్కి వెక్కి ఏడిచింది మళ్ళీ. అతడు ఆశ్చర్యపోతూ, 'ఏమిటే!' అన్నాడు. ఆమె దుఃఖం

అప్రుకుంటూ, "ఏమండీ, మా అమ్మ మీరు గాని మళ్ళీ పెళ్ళి చేస్తానంటే మీరు ఒప్పుకోరుకదా ?" అంది. అతడు నిర్ఘాంతపోయి, ఆమెను తన కౌగిలిలోకి తీసుకుని ప్రేమతో, 'ఏమిటీ ఈ నాన్సెన్సంతా ?' అన్నాడు. ఆమె మరి మాట్లాడలేదు. తనకింక భయంలేదన్నట్లుగా అలాగే నిద్రపోయింది.

ఆ మర్నాడు సీతన్న వంటకిరాలేదు. అతనిస్థానే అతనితల్లి గవరమ్మ గారొచ్చింది. 'ఏవమ్మా, నువ్వొచ్చావు ?' అంది కల్పకమ్మగారు.

'మా సీతయ్య అత్తవారింటికెళ్ళాడండి. రేపు సాయంత్రానికొచ్చేస్తాడు.'

'ఏం. ఎందుకు ? కోడల్ని పుట్టింటికి పంపించావా ?'

'లేదండి. కోడల్ని తీసుకురావటానికే వెళ్ళాడు.'

ఆ మాట వినేసరికి కల్పకమ్మకి, లోపల గదిలో ఉండి వింటూన్న సత్యవతికీకూడా ఆశ్చర్యం వేసింది. కల్పకమ్మగారు, 'తీసుకురావటానికంటా వేమిటి ? మొన్ననేగా మీ కాశమ్మ మాయింటికొచ్చి వెళ్ళింది !'

'నిజమేనండి. నాఖర్మకొద్దీ నాకూ దానికీ తగువొచ్చింది. ఏమీలేదు అది ఒక పౌడరుడబ్బా కొంది. అది నిన్న నా కంటపడింది. 'బోలెడు డబ్బోసి మనకెందుకే ఈ పౌడర్లు ?' అన్నాను. పెద్దదాన్ని అంటే అన్నానని ఊరుకోవచ్చా ? 'మధ్య నీ బోడిపెత్తనమేమిటి ? నా ఇష్టం ?' అని చంపమీద కొట్టినట్లు చెప్పింది. చెట్టంతమనిషిని నన్నిలాగ అందీ అంటుంతో నాకు 'చుర్రు'మని, నేను దానిజుట్టు కాస్త పట్టుకున్నమాట నిజమే అనుకోండి. ఏతేం, పడుచుదేమో అది ఒక్కతోపు తోసేసరికి వెల్లకితలా పడిపోయాను. సరిగ్గా ఆ సమయానికి మా సీతన్న రావటం, చూడటం జరిగి, నేను 'వొద్దురా' అని అడ్డపడ్డా వినక దాన్ని రెండు వేశాడు. అంతే. ఈవేళ తెల్లవారి చూసుకున్నాం, కాశమ్మ ఇంట్లోలేదు. పుట్టింటికే పోయుంటుంది లెండి.'

సత్యవతి అంతా వింటూనే ఉంది. కాశమ్మకి తనే ఆ పౌడరుడబ్బా ఇస్త ! 'చిలిపితనం కాకపోతే కొన్నానని చెప్పటమేమిటి వెర్రిపిల్ల ! పనివేగా ముప్పు తెచ్చుకుంది కావమ్మ' అనుకుంది. ఇంతలో కల్పకమ్మ మాటలు వినపడ్డాయి.

'అంచేత నీ కొడుకు దానికోసం వెనకాలే పరుగెత్తాడన్నమాట! అందుకే దానికి లోకువై ఆడింది ఆటా, పాడింది పాటా చేస్తోంది. కొన్నాళ్లూరుకుంటే రోగం చప్పగా కుదిరి వాళ్ళే తీసుకొచ్చి దిగబెడూతురుగా?'

'దిగబెట్టరమ్మా. అలాంటి రకంగాదు వాళ్ళు. మా వియ్యపరాలు దీనికి మద్దత్తుగనకనే ఇది ఇలా వేపుగుతింటోంది మమ్మల్ని.'

"అలాగా, నీకు చేతగాదన్నమాట. 'దిగబెట్టటం' అని వాళ్లు అన్నారూ అంటే, ఆ మర్నాడే మరొక త్తెనుచూసి నీ కొడుక్కి పెళ్లిచేస్తే సరి. దానితో పిల్లరోగం తల్లిరోగంకూడా చప్పగా కుదురుతుంది!" అంది కల్పకమ్మ.

సత్యవతి వళ్ళు ఝల్లుమంది! ఎంత ఘోరంగా చెబుతోంది సలహా! 'స్త్రీకి శత్రువు స్త్రీయే' అంటే ఇదే కామోసు!...గవరమ్మ సమాధానం వినబడుతోంది. "అమ్మా, కల్పకమ్మగారూ, మీరు చెప్పినది సబబుగానే ఉందిగాని, మావాడికి మళ్ళీ పెళ్లిచెయ్యాలీ అంటే అంత పైపైనఉందా? మీ ఋంటా మీ యింటా నౌఖరీచేసి కూడబెట్టిన తొమ్మిదివందల రూపాయిలూ పట్టుకెళ్లి ఆ బ్రహ్మయ్య చేతిలో పోస్తేనేకానీ ఈ పెళ్ళి అయింది కాదు. 'మళ్ళీ పెళ్ళి' అంటే డబ్బేదీ?"

సత్యవతీ వింటూ మనస్సులో, 'కాశమ్మ కాపరానికి పరవాలేదన్నమాట. ఆ పిల్ల వీళ్లకి కష్టార్జితం గనక వదులుకోలేరు' అనుకుంది. కాశమ్మకు సాగినట్టు తనకుమాత్రం సాగదు. తన అత్తగారికి డబ్బున్నది. తలచుకుంటే ఎంత పనిఐనా చెయ్యగలదు. కక్కినకూటికి వడిపట్టి, పిల్లమీద పిల్లల్ని ఇచ్చేవాళ్లూ ఉన్నారు. ఎందుకైనా మంచిది. తను జాగ్రత్తగానే ఉండాలి' అనుకుంది.